క్లుప్తంగా

ఎస్సీ వర్గీకరణకు అలుపెరగని పోరాటం



ఆవిర్భావ దినోత్సవంలో ఎమ్మార్పీఎస్ నాయకులు

హయత్‌నగర్: ఎస్సీ వర్గీకరణ కోసం ఎమ్మార్పీఎస్ అలుపెరగని పోరాటం చేస్తుందని ఆ సంఘం బాలాపూర్ మండల మాజీ అధ్యక్షుడు జి.ఆర్.దానయ్య మాదిగ అన్నారు. ఎమ్మార్పీఎస్ 29వ ఆవిర్భావ దినోత్సవం సందర్భంగా శుక్రవారం ఎమ్మార్పీఎస్ జెండాను ఆవిష్కరించి మాట్లాడారు. మాదిగల డిమాండ్లను దృష్టిలో ఉంచుకొని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఎస్సీ వర్గీకరణ చేయాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జల్‌పల్లి అధ్యక్షుడు యంజాల దేవేందర్, మాజీ అధ్యక్షుడు శివకుమార్, యాదగిరి, రామారావు, కృష్ణాగౌడ్, కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

ముచ్చటగా మూడోసారి



కృష్ణనాయక్‌ను అభినందిస్తున్న కాంగ్రెస్ నాయకులు

కందుకూరు: కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడిగా కృష్ణనాయక్‌ను మూడోసారి నియమించారు. ఈ మేరకు పార్టీ జిల్లా అధ్యక్షుడు చల్లా నర్సింహారెడ్డి ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా కృష్ణనాయక్ మాట్లాడుతూ.. తనకు మరోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించినందుకు పార్టీ నేతలకు కృతజ్ఞతలు తెలుపుతూ.. పార్టీ బలోపేతానికి కృషి చేస్తానని చెప్పారు.

10నుంచి మధ్యాహ్న భోజన కార్మికుల సమ్మె



ఎంపీడీఓకు సమ్మె నోటీసు అందజేస్తున్న సీఐటీయూ నాయకులు

కందుకూరు: మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యల పరిష్కారం కోసం ఈ నెల 10నుంచి 12వ తేదీ వరకు సమ్మె చేయనున్నట్లు సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాల్‌రాజ్ తెలిపారు. ఈ మేరకు ఎంపీడీఓ వెంకట్రాములుకు సమ్మె నోటీసు అందజేసి మాట్లాడారు. జీఓ 8 ప్రకారం వేతనాలు చెల్లించాలని కోరారు. పెండింగ్ బిల్లులు వెంటనే విడుదల చేయాలని, కొత్త మెనూను సవరించాలన్నారు. కార్యక్రమంలో మధ్యాహ్న భోజన సంఘం, సీఐటీయూ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

రాజరాజేశ్వరికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో శ్రీరాజరాజేశ్వరీదేవి

మహేశ్వరం: శివగంగ రాజరాజేశ్వర ఆలయంలో శుక్రవారం భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉదయం అమ్మవారికి అభిషేకం, కుంకుమార్చన చేశారు. శివుడికి పూలతో అభిషేకం, పూజలు చేశారు. ఈ సందర్భంగా అమ్మవారు ప్రత్యేక అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ చైర్మన్ నిమ్మగూడెం సుధీర్ గౌడ్, డైరెక్టర్లు, పూజారులు తదితరులు పాల్గొన్నారు.

ఆత్మవిశ్వాసం పెంపొందించుకోవాలి

డీసీపీ జానకి



స్నాతకోత్సవంలో పాల్గొన్న డీసీపీ జానకి

బడంగ్‌పేట్: ప్రతి విద్యార్థి ధృఢ సంకల్పం, ఆత్మవిశ్వాసం, సమష్టి కృషి, నాయకత్వ లక్షణాలు పెంపొందించుకోవాలని రాచకొండ డిప్యూటీ కమిషనర్ జానకి ధరావత్ సూచించారు. శుక్రవారం కీసర పల్లవి ఇంటర్నేషనల్ స్కూల్ స్నాతకోత్సవ వేడుకల్లో డీసీపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రతి విద్యార్థి లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో విద్యాసంస్థల డైరెక్టర్ సుశీల్, పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

మూతపడిన 'అన్నపూర్ణ'

- రాత్రికి రాత్రే క్యాంటిన్ తరలింపు
- వారం రోజులుగా నిరుపయోగం
- భోజనం కరువై.. ఇబ్బంది పడుతున్న దినసరి కూలీలు



కట్టమైసమ్మ దేవాలయం కిందున్న రహదారికి తరలించిన క్యాంటిన్

మీర్‌పేట: ఆకలితో ఉన్న పేదల కడుపు నింపాలన్న సంకల్పంతో జీహెచ్ఎంసీ పరిధిలో అన్నపూర్ణ పథకానికి ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. కానీ ఆకలి తీర్చే ఆ పథకానికి అరిష్టాలు తప్పలేదు. మీర్‌పేట కార్పొరేషన్ బాలాపూర్ చౌరస్తాకు సమీపంలో మూడేళ్ల క్రితం అన్నపూర్ణ క్యాంటిన్‌ను ప్రారంభించారు. అడ్డా కూలీలకు రూ.5 భోజనం క్యాంటిన్ ఎంతగానో ఉపయోగపడేది. నిత్యం అధిక సంఖ్యలో కూలీలు భోజనాన్ని తినేవారు. ఏమైందో ఏమో తెలియదు కానీ.. ఉన్న ఫలంగా క్యాంటిన్ మూతపడింది.

రాత్రికి రాత్రే..

పేదల ఆకలి తీరుస్తున్న అన్నపూర్ణ క్యాంటిన్‌ను రాత్రికి రాత్రే కట్టమైసమ్మ దేవాలయం వద్దకు తరలించారు. కార్పొరేషన్ అధికారులకు సమాచారం ఇవ్వకుండా.. దుకాణ సముదాయాల యజమానులు, స్థానిక నేతల అండతోనే రూ.5 భోజనం క్యాంటిన్ అడ్డా మార్చారని దినసరి కూలీలు ఆరోపిస్తున్నారు. క్యాంటిన్‌ను మార్చడంతో తాము భోజనం చేసేందుకు ఇబ్బంది పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వ్యాపారుల కోసం క్యాంటిన్‌ను తరలించడం సరైంది కాదని, వెంటనే కార్పొరేషన్ అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి యథాస్థలంలో క్యాంటీన్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు.

> **చర్యలు తీసుకుంటాం**
>
> 
>
> అనుమతి లేకుండా క్యాంటిన్‌ను తరలించిన వారిపై చర్యలు తీసుకుంటాం. వెంటనే సిబ్బందిని పంపించి మొదట ఉన్న చోటే క్యాంటిన్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు తీసుకుంటాం. అందరికీ భోజనం అందించేలా చూస్తాం.
>
> – సీహెచ్. నాగేశ్వర్, కమిషనర్, మీర్‌పేట కార్పొరేషన్

అక్రమ నిర్మాణాలు అడ్డుకోవాలి



పెద్దఅంబర్‌పేట కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేస్తున్న రైతు కుటుంబాలు

అబ్దుల్లాపూర్‌మెట్: భూ వివాదం కోర్టు పరిధిలో ఉన్నప్పటికీ.. ఆ స్థలంలో చేపడుతున్న అక్రమ నిర్మాణాలను అడ్డుకోవాలని పెద్దఅంబర్‌పేట రైతులు డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేశారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడారు. పెద్దఅంబర్‌పేట పురపాలక సంఘం 5వ వార్డులో సర్వే నం.266లో సుమారు 21.15 ఎకరాల భూమికి సంబంధించి కొంత కాలంగా కోర్టు పరిధిలో వివాదం జరుగుతోంది. అయినప్పటికీ.. కొందరు రియల్టర్లు అక్రమంగా నిర్మాణాలు చేపడుతున్నారు. వాటిని నిలిపివేయాలంటూ పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకువచ్చినా పట్టించుకోలేదని, వాటికి ఇంటి నంబర్లు సైతం తీసుకున్నారని వాపోయారు. అనంతరం అక్రమ కట్టడాలను కూల్చివేయాలని కోరుతూ కమిషనర్ సత్యనారాయణరెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గిరి, సంజీవ, శ్రీరాములు, అర్జున్, రాజు, శ్రీను, ప్రహ్లాద్, నర్సింహ, అంజయ్య, సాయిలు, నరేష్ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను పర్మినెంట్ చేయాలి



ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికుల నిరసన

- కనీసం వేతనం రూ.26 వేలు ఇవ్వాలి
- సీఐటీయూ మండల కన్వీనర్ బాలరాజ్
- రెండో రోజుకు చేరుకున్న కార్మికుల సమ్మె

కందుకూరు: గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించే వరకు సమ్మె కొనసాగిస్తామని సీఐటీయూ మండల కన్వీనర్ బుట్టి బాలరాజ్ అన్నారు. సమస్యల సాధన కోసం స్థానిక ఎంపీడీఓ కార్యాలయం ఎదుట కార్మికులు చేపట్టిన సమ్మె రెండో రోజుకు చేరుకుంది. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ.. కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని, కారోబార్లను జూనియర్ పంచాయతీ కార్యదర్శులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ మహేశ్వరం కన్వీనర్ రవి కుమార్, కార్మికులు కృష్ణ, మహేష్, పోచమ్మ, భారతమ్మ తదితరులు పాల్గొన్నారు.

జీపీ కార్మికులను..

తలకొండపల్లి: గ్రామ పంచాయతీల్లో పారిశుద్ధ్య, తదితర విభాగాల్లో పనిచేస్తున్న కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని, కనీస వేతన రూ.19 వేలు చెల్లించాలని రైతుసంఘం జిల్లా ఉపాధ్యక్షుడు కాడిగల్ల భాస్కర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సమస్యల సాధన కోసం జీపీ కార్మికులు చేపట్టిన సమ్మె శుక్రవారానికి రెండో రోజుకు చేరుకుంది. మండల కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయ ఆవరణ ఎదుట బైఠాయించి సమ్మె చేస్తున్న కార్మికులకు భాస్కర్ మద్దతు పలికారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జీఓ నంబర్ 51ని సవరించి, మల్టీపర్పస్ వర్కర్ విధానాన్ని రద్దు చేసి, పాత కేటగిరి విధానాన్ని అమలు చేయాలని కోరారు. కారోబార్, బిల్ కలెక్టర్లను సహాయ కార్యదర్శులుగా నియమించాలని, పీఎఫ్, ఈఎస్ఐ, రూ.10 లక్షల ప్రమాద బీమా సౌకర్యాలు కల్పించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా నాయకులు వెంకటయ్య, కురుమయ్య, డీవైఎఫ్ఐ జిల్లా ఉపాధ్యక్షుడు శివశంకర్, గొర్ల కాపరుల జిల్లా నాయకుడు పెంటయ్య, కార్మికుల అధ్యక్షురాలు యాదమ్మ, కో కన్వీనర్ రవలి, సభ్యులు యాదమ్మ, బిక్షపతి, అలివేలు, జంగమ్మ, సుగుణమ్మ, లక్ష్మీదేవి, రామచంద్రయ్య, పాండు, పోచయ్య, సిద్దు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న కార్మికుల సమ్మె

యాచారం: ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేస్తూ పంచాయతీ సిబ్బంది చేస్తున్న సమ్మె రెండో రోజుకు చేరింది. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయం ఎదుట నిరసన కార్యక్రమంలో కార్మికులు మాట్లాడారు. జీపీ కార్మికులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించి, కనీస వేతనం రూ.20 వేలు చెల్లించాలని డిమాండ్ చేశారు.

ఇబ్రహీంపట్నంలో..

ఇబ్రహీంపట్నం: గ్రామ పంచాయతీ కార్మికుల హక్కులను ప్రభుత్వం కాలరాస్తుందని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య ఆరోపించారు. రెండోరోజు కార్మికుల సమ్మెకు ఆయన మద్దతు తెలుపుతూ మాట్లాడారు. కార్మికులకు ప్రస్తుతం రూ.8,500వేల వేతనం మాత్రమే ఉందని, కనీస వేతనం రూ.26 వేలకు పెంచాలని డిమాండ్ చేశారు. అదే విధంగా పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. కార్మికుల సమస్యలను పరిష్కరించకుంటే ఉద్యమాన్ని ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ మండల కార్యదర్శి పూల యాదయ్య, సీఐటీయూ నేతలు పాల్గొన్నారు.

నేడు కళాశాల భవనాలను ప్రారంభించనున్న మంత్రి

మహేశ్వరం: మహేశ్వరం మండలం కేసీ తండా పరిధిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల, పాలిటెక్నిక్ కళాశాల, మోడల్ స్కూల్ హాస్టల్ నూతన భవనాలను శనివారం మంత్రి సబితారెడ్డి ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమానికి జెడ్పీ చైర్ పర్సన్ తీగల అనితారెడ్డి, చేవెళ్ల ఎంపీ గడ్డం రంజిత్‌రెడ్డి, ఎంపీపీ కోరుపోలు రఘుమారెడ్డి హాజరుకానున్నారు.

ప్రధాని పర్యటన విజయవంతం చేయాలి

తుక్కుగూడ: వరంగల్ జిల్లాలో జరిగే ప్రధాన మంత్రి నరేంద్రమోదీ పర్యటనను విజయవంతం చేయాలని బీజేపీ మీడియా రాష్ట్ర కన్వీనర్ సుధాకర్ శర్మ కోరారు. ఆయన శుక్రవారం మున్సిపాలిటీ కేంద్రంలో మాట్లాడారు. వేల కోట్ల రూపాయలతో చేపట్టే అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసిన అనంతరం.. హనుమకొండ ఆర్ట్స్ కళాశాలలో జరిగే బహిరంగ సభలో మోదీ ప్రసంగించనున్నట్లు వెల్లడించారు.

బీజేపీ బీ టీమ్‌గా బీఆర్ఎస్

కప్పాటి పాండురంగారెడ్డి

కందుకూరు: బీజేపీకి బీఆర్ఎస్ పార్టీ 'బి' టీమ్‌గా వ్యవహరిస్తోందని జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ కప్పాటి పాండురంగారెడ్డి విమర్శించారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. అవినీతి ఊబిలో కూరుకుపోయిన బీఆర్ఎస్ అగ్రనేతలు.. బయటపడేందుకు బీజేపీతో లోపాయకారి ఒప్పందం కుదుర్చుకున్నారని ఆరోపించారు. బీఆర్ఎస్ నేతలు మాయమాటలతో ప్రజలను మభ్యపెట్టలేరన్నారు. ప్రధాని మోదీ, కేంద్రమంత్రి అమిత్‌షా సూచనలతోనే బీఆర్ఎస్ పని చేస్తోందని విమర్శించారు.

మంత్రి కేటీఆర్‌ను కలిసిన గోలి



మంత్రితో శ్రీనివాస్‌రెడ్డి

ఆమనగల్లు: హైదారాబాద్ తెలంగాణ భవన్‌లో శుక్రవారం పురపాలక శాఖ మంత్రి కేటీఆర్‌ను బీఆర్ఎస్ రాష్ట్ర నాయకుడు గోలి శ్రీనివాస్‌రెడ్డి కలిశారు. ఈ సందర్భంగా కల్వకుర్తి నియోజకవర్గ సమస్యల గురించి మంత్రి వద్ద గోలి ప్రస్తావించారు.

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

తలకొండపల్లి: రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన మల్లేశ్ కుటుంబానికి అండగా ఉంటామని నాగర్‌కర్నూల్ జిల్లా జెడ్పీ వైస్‌చైర్మన్ ఠాకూర్ బాలాజీసింగ్, బీజేపీ సీనియర్ నాయకుడు తల్లోజు ఆచారీలు చెప్పారు. తలకొండపల్లి మండలం పడకల్‌కు చెందిన మల్లేశ్ గురువారం రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. విషయం తెలుసుకున్న బాలాజీసింగ్, ఆచారీలు బాధిత కుటుంబ సభ్యులను పరామర్శించి, రూ.10వేలు ఆర్థిక సహాయం చేయగా.. జెడ్పీటీసీ ఉప్పల వెంకటేశు రూ.3వేలు, సర్పంచ్ రమేష్ రూ.5వేలు, కుమ్మరి శంకర్ రూ.5వేలు, యవకులు రూ.12వేలను మల్లేశ్ కుటుంబానికి ఆర్థిక సాయంగా అందజేశారు. కృష్ణగౌడ్, స్వామి, సత్యం, రాములు, శ్రీశైలం, ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

రేపు మండలంలో ప్రొ. కోదండరాం పర్యటన

యాచారం: తెలంగాణ జన సమితి అధ్యక్షుడు ప్రొఫెసర్ కోదండరాం ఆదివారం యాచారం మండలంలో పర్యటించనున్నారని టీజేఎస్ జిల్లా ఉపాధ్యక్షుడు సామ నిరంజన్ తెలిపారు. ఈ మేరకు ఆయన శుక్రవారం మాట్లాడారు. తెలంగాణ బచావో పేరుతో ఫార్మాసిటీ బాధిత ప్రాంతాల్లో ప్రజాయాత్ర నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఫార్మాసిటీ ఏర్పాటైతే పరిసర ప్రాంతాల గొలుసు కట్టు చెరువులు కలుషితమయ్యే ప్రమాదం ఉందనే ప్రచారం నేపథ్యంలో చెరువులను పరిశీలించనున్నట్లు ఆయన వెల్లడించారు.

పాత పద్ధతిలోనే పన్నులు వసూలు చేయాలి



అధికారులకు వినతిపత్రం అందజేస్తున్న ఫ్లోర్‌లీడర్ కవిత, కార్పొరేటర్ మౌనిక

మీర్‌పేట: పాత పద్ధతిలోనే ఇంటి పన్నులు వసూలు చేయాలని కాంగ్రెస్ పార్టీ మీర్‌పేట ఫ్లోర్‌లీడర్ చల్లా కవిత, కార్పొరేటర్ సిద్దాల మౌనిక కోరారు. ఈ మేరకు కార్పొరేషన్ అధికారులకు వినతిపత్రం అందజేసి మాట్లాడారు. మంత్రి సబితారెడ్డి పెంచిన పన్నులు ఎవరికీ వర్తించవని గత కౌన్సిల్ సమావేశంలో ప్రకటించారని పేర్కొన్నారు. అయినా యథావిధిగా పన్నులు వసూలు చేస్తున్నారని తెలిపారు. మంత్రి హామీ కాగితాలకే పరిమితమైందని ఎద్దేవా చేశారు. పన్నులను తగ్గించకుంటే ధర్నా చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నాయకులు యాదిరెడ్డి, సురేందర్‌రెడ్డి, శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్, శేఖర్‌రెడ్డి, పరశురాం, కోటేశ్వర్‌రెడ్డి, అనిల్‌కుమార్, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కల్తీ కల్లును అరికట్టండి

ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్ రావు



ఈత మొక్కలు నాటుతున్న రవీందర్‌రావు

మహేశ్వరం: గ్రామాల్లో ఈత, తాటి వనాలు పెంచి, కల్తీ కల్లును అరికట్టాలని సరూర్‌నగర్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవీందర్‌రావు అన్నారు. తాటి, ఈత, ఖర్జూర మొక్కలతో గౌడన్నలకు ఉపాధి లభిస్తుందన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం మన్సాన్‌పల్లిలో హరితహారంలో భాగంగా మల్లేశ్ గౌడ్ అనే గీత కార్మికుడి పొలంలో 100 ఈత మొక్కలను నాటారు. ఈ సందర్భంగా రవీందర్‌రావు మాట్లాడారు. చెరువు గట్లు, ప్రభుత్వ భూముల్లో ఈత మొక్కలను పెంచాలని సూచించారు. హరితహారంలో నాటిన మొక్కలను సంరక్షించాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. అసిస్టెంట్ ఎక్సైజ్ సూపరింటెండెంట్ హనుమంతరావు, మహేశ్వరం ఎక్సైజ్ సీఐ వీణారెడ్డి, ఎస్ఐలు హనుమంతు నాయక్, ప్రవీణ్, గౌడ సంఘం నాయకులు రాఘవేందర్ గౌడ్, మల్లేష్ గౌడ్, యాదయ్య గౌడ్, అంజయ్య గౌడ్ పలువురు పాల్గొన్నారు.

ఘనంగా లలిత సహస్రనామ యజ్ఞం



సహస్రనామ యజ్ఞంలో భక్తులు

ఆమనగల్లు: శ్రీ వాసవీ కన్యకా పరమేశ్వరీ దేవాలయంలో శుక్రవారం ఆర్యవైశ్య సంఘం ఆధ్వర్యంలో శ్రీ లలిత సహస్రనామ యజ్ఞం నిర్వహించారు. మహోత్సవం సందర్భంగా ఆలయాన్ని శోభాయమానంగా అలంకరించారు. కార్యక్రమంలో భాగంగా ఉదయం అమ్మవారికి అభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అనంతరం ప్రత్యేక పూజలు, అర్చనలు, గోమాత సేవ కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ పూజారులు గిరీశ్ శర్మ, శ్రీనివాస్ శర్మ, కృష్ణమాచార్యులు, శివానందస్వామిల ఆధ్వర్యంలో యజ్ఞం, సామూహిక కుంకుమార్చన అనంతరం అన్నదానం చేశారు. ఈ సందర్భంగా వైశ్య గురుసేవా రత్న బిరుదాంకితురాలు స్వరూపరాణి సహస్రనామ పారాయణం విశిష్టత గురించి వివరించారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు వీరబొమ్మ రామ్మోహన్, ప్రధాన కార్యదర్శి బికుమాండ్ల నర్సింహ, కోశాధికారి శ్రీనివాస్, ఆలయ ఫౌండర్, చైర్మన్ బికుమాండ్ల యాదయ్య, ఉపాధ్యక్షుడు బికుమాండ్ల పాండయ్య, నాయకులు చంద్రశేఖర్, శ్యాం, కృష్ణయ్య, శేఖర్, జగదీశ్, గోపాల్, మల్లేశ్, కృష్ణయ్య, జగన్, ఆర్యవైశ్య మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్సీ

ఆమనగల్లు: పలువురు లబ్ధిదారులకు సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్సీ కసిరెడ్డి నారాయణరెడ్డి శుక్రవారం పంపిణీ చేశారు. ఆమనగల్లు మండలం మేడిగడ్డ తండాకు చెందిన రమేశ్‌కు రూ.56 వేలు, కల్యాణ్‌కు రూ.60 వేలు, ఆమనగల్లుకు చెందిన సనా సిమ్రాన్‌కు రూ.14 వేలు, కడ్తాల మండలం ఎక్వాయిపల్లికి చెందిన జయమ్మకు రూ.16 వేలు, తలకొండపల్లి మండలం రాంపూర్‌కు చెందిన శిరీషకు రూ.19 వేలు మంజూరు కాగా.. హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో ఎమ్మెల్సీ లబ్ధిదారులకు చెక్కులు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు గోలి సురేందర్‌రెడ్డి, కసిరెడ్డి వెంకట్‌రెడ్డి, విజయ్‌రాథోడ్, శంకర్, జోతయ్య, రాములుయాదవ్, జగన్, తదితరులు పాల్గొన్నారు.

కబ్జాలకు పాల్పడుతున్న బీఆర్ఎస్ నేతలు

బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీరాములు



సమావేశంలో మాట్లాడుతున్న శ్రీరాములు

బడంగ్‌పేట్: బీఆర్ఎస్ నేతలు భూ కబ్జాలకు పాల్పడుతున్నారని బీజేపీ మహేశ్వరం నియోజకవర్గ ఇన్‌చార్జి అందెల శ్రీరాములు ఆరోపించారు. ఈ విషయంలో మంత్రి సబితారెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. సుందరీకరణ పేరుతో ప్రభుత్వ స్థలాలను మాయం చేస్తున్నారని, ఇంద్రసేనారెడ్డి ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు పార్కులను, చెరువులను కాపాడారని గుర్తుచేశారు. సబిత హయాంలో ఆమె అనుచరులు భూ కబ్జాలకు పాల్పడుతూ, అమ్ముకుంటున్నారని ఆరోపించారు. నాదర్‌గుల్‌లో దళితుల అసైన్డ్ భూములను గుంజుకొని ఐటీ కంపెనీలకు దారాదత్తం చేశారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు వెంకట్‌రెడ్డి, కార్పొరేటర్ ఇంద్రసేనా, వెంకటేశ్, పార్టీ నాయకులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీకి పూర్వవైభవం తెస్తాం



పార్టీలో చేరిన వారికి కండువాలు కప్పుతున్న ఈశ్వర్

మహేశ్వరం: కాంగ్రెస్‌కు పూర్వవైభవం తీసుకొస్తామని ఆ పార్టీ మండల అధ్యక్షుడు ఈశ్వర్ ముదిరాజ్ అన్నారు. శుక్రవారం మహేశ్వరం మండలం పోరండ్ల గ్రామానికి చెందిన బీఆర్ఎస్ సీనియర్ నాయకులు, పీఏసీఎస్ డైరెక్టర్, మాజీ సర్పంచ్ మోడి జంగయ్యతో పాటు పలువురు కార్యకర్తలు పాండు ముదిరాజ్, చేపంగి ప్రవీణ్ ఆధ్వర్యంలో కాంగ్రెస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఈశ్వర్ మాట్లాడారు. పార్టీ సిద్ధాంతాలకు ఆకర్షితులై కాంగ్రెస్‌లో చేరుతున్నారని చెప్పారు. బీఆర్ఎస్, బీజేపీలు ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తూ దేశాన్ని మోసం చేస్తున్నాయని ఆరోపించారు. కాంగ్రెస్ హయాంలో దళితులు, బీసీలు, గిరిజనులు, మైనార్టీలు, అగ్రవర్ణాల్లో ఉన్న పేదలకు సాగు చేసుకోవడానికి అసైన్డ్ భూమి, ఉండడానికి ఇందిరమ్మ ఇళ్లను పంపిణీ చేసిందని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో రాష్ట్రంలో కాంగ్రెస్ గెలుస్తుందని ధీమా వ్యక్తంచేశారు. కార్యక్రమంలో పార్టీ సీనియర్ నాయకులు నర్సింహ, శ్రీకాంత్, రాజేందర్, ప్రసాద్, ప్రవీణ్, పాండు తదితరులు పాల్గొన్నారు.

మా గ్రామాన్ని మాడ్గులలోనే ఉంచండి

ఆమనగల్లు: నల్లచెరువు గ్రామాన్ని మాడ్గుల మండలంలోనే ఉంచాలని నల్లచెరువు గ్రామస్తులు డిమాండ్ చేశారు. ఈ మేరకు కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం అదనపు కలెక్టర్ తిరుపతిరావుకు వినతి పత్రం అందజేశారు. మాడ్గులకు 3 కిలోమీటర్ల దూరంలో ఉన్న నల్లచెరువు గ్రామాన్ని 8 కిలో మీటర్ల దూరంలో ఉన్న ఇర్విన్ మండలంలో విలీనం చేయవద్దని పేర్కొన్నారు. కార్యక్రమంలో నవీన్‌గౌడ్, వెంకట్‌రెడ్డి, శ్రీశైలం తదితరులు పాల్గొన్నారు.



అదనపు కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న నల్లచెరువు గ్రామస్తులు

బుగ్గయ్యగౌడ్ సేవలు చిరస్మరణీయం



బుగ్గయ్యగౌడ్ చిత్రపటానికి నివాళి అర్పిస్తున్న నాయకులు

కడ్తాల్: ఆమనగల్లు మాజీ ఎంపీపీ పాలకూర్ల బుగ్గయ్యగౌడ్ ప్రజాప్రతినిధిగా, నాయకుడిగా ఈ ప్రాంత ప్రజలకు అందించిన సేవలు చిరస్మరణీయమని, పీసీసీ సభ్యుడు అయిళ్ల శ్రీనివాస్‌గౌడ్, ఎంపీపీ కమ్లీమోత్యానాయక్ పేర్కొన్నారు. బుగ్గయ్యగౌడ్ ద్వితీయ వర్ధంతి సందర్భంగా శుక్రవారం కడ్తాల్ మండలం ఎక్వాయిపల్లిలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పించారు. కార్యక్రమంలో డీసీసీ అధికార ప్రతినిధి శ్రీనివాస్‌రెడ్డి, జిల్లా యూత్ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి రవికాంత్‌గౌడ్, పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి బీక్యానాయక్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు నర్సింహ, పార్టీ మండల అధ్యక్షుడు బీచ్యానాయక్, సింగిల్‌విండో డైరెక్టర్ వెంకటేశ్, ఎంపీటీసీలు ఉమావతి, రాములుగౌడ్, మాజీ సర్పంచ్ శేఖర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.